కథ

# అదీ అసలు రహస్యం

కె.కె. రఘునందన



వెన్నెల వెండి జలతారులై కురుస్తోంది. అరకొర మేఘాల ఈర్ష్యాసూయాలు జాబిలమ్మకు దాగుడుమూతలైనాయి. పడుచు జంటలకు స్ఫూర్తిదాయకమైన ఆహ్లాదకర వాతావరణం. భార్గవ్ మేడ మీదకి గబగబ నడిచాడు. పక్కన పిల్లలను పడుకోబెట్టుకోని ఆదమరచి నిద్రిస్తోంది శిల్ప. ఆమె చెంతన మెల్లగా చేరాడు భార్గవ్. భార్య నడుం మడతపైన సుతిమెత్తగా తడిమాడు. మరోసారి నడుం చుట్టుతా చెయ్యేసి చుట్టేసాడు. ఒక్కసారిగా ఉలిక్కిపడి పక్కకు తిరిగింది. తప్పన్నట్టు చూపులు విసిరింది.

"ఈ వెన్నెలను చూస్తే నీకేమనిపించటం లేదా శిల్పా!"

"హాయిగా అనిపిస్తోంది. పిల్లలను నిద్రపుచ్చాక మనం నిద్రపోతే బహుభేషుగ్గా ఉంటుందనిపిస్తోంది".

"మరిక ఆలస్యం దేనికి? పిల్లలు మత్తులో పడ్డారు. ఇంక మనవంతు... దేనికో నీకు తెలీనిది కాదు" అని శిల్పను తన మీదకి లాక్కున్నాడు భార్గవ్.

"ముదిమికి ముచ్చట్లు రావుట" చేతిని సుకుమారంగా తోసేసింది.

"ఏం మనం అరవైలో పడ్డామా ఏమిటి? ఇద్దరు పిల్లలు నీకు పాతిక నిండా రాకుండానే పుట్టేసారు. నాకు బట్ట తలంటావా... అదీ రోజుల్లో కామన్." ఆమెనే తనివి తీరా చూస్తూ అన్నాడు.

పలుచటి పొట్టమీంచి పాముపారలా పాకిన పైట ఎత్తైన రెండు కొండల మధ్యకు చేరింది. అది చూసి భార్గవ్ ఉద్విఘ్నుడైనాడు. తన చేతిని మెల్లగా పాకించి మృదువుగా అదిమాడు. అది గమనించి శిల్ప చటుక్కున లేచి కూర్చుంది.

"ప్లీజ్ శిల్పా! నువ్వు కాదంటే నేనేమైపోవాలి? ఒక్కసారి... ప్లీజ్..." అని సాహసించి ఆమె పెదవులతో తన పెదాలను కలిపేసాడు.

"ఛ ఛ... మీరు శృతిమించి పోతున్నారు. పరాకాష్టకు చేరితే ప్రమాదం".

"ప్రమాదం కాదు. ప్రమోదం. ఇటువంటి పిండార బోసిన వెన్నెల్లో పసిపిల్లల్లా పడుక్కోని ఎంతకాలమైందో..."

"ఛీ! సిగ్గులేదూ ఆ మాటనడానికి. పిల్లలు పుట్టినా కూడా ఆ యావే!" కోపం ప్రదర్శించింది శిల్ప.

"ఆ యావ లేనిదెవరికని? అరవైలో కూడా ఇరవైలా ఉండేది ఎందరని?" చిలిపి తనంతో ఆమె పెదవిమీద వేలితో మీటాడు.

"అంటే ఇంకా వెర్రివేషాలు వేద్దామనా? చాల్చాలు. మరిక వెకిలి చేష్టలకి పూర్ణబిందువు పెట్టెయ్యండి". భర్త చేతులు విడిపించుకొని అటు తిరిగిపోయింది శిల్ప.

అంత పండువెన్నెలా ఒక్కసారిగా మసకబారినట్టుగా అయిపోయింది భార్గవ్‌కి. భార్యామణి అంతరంగంలో ఇంత అంతరం ఎలా ఏర్పడింది? తన గత స్మృతులెంత మాధుర్యమైనవి!

ఆనాటి శిల్ప.... ఈనాటి శిల్ప... అభినివేశాల్లో... అభిరుచుల్లో ఎంత వ్యత్యాసం! ఏ మాత్రం పొత్తుకుదరని పోలికలు.

భార్గవ్ హృదయం గత వైభవోపేత సంఘటనల్లోకి తొంగిచూసింది.

***

"మీకు అన్నీ గుర్తుంటాయిగానీ, మూరెడు మల్లెలు తేవడానికి మాత్రం జ్ఞాపకం ఉండదు. ఛీ! నాతో మాట్లాడద్దు" సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వస్తున్న భర్తను


చూడగానే అలిగి వెళ్ళిపోయింది శిల్ప.

వెనకాలే పరుగున వెళ్ళి భార్యను బ్రతిమలాడ్డంలో పడ్డాడు భార్గవ్.

''ప్లీజ్ శిల్పా! నేను కోరి మానేసానని అనుకున్నావు కదూ! మా ఆఫీసులో ఒకరికి ఒంట్లో బాగోకపోతే ఆసుపత్రికి తీసుకెళ్ళాను. ఆ బిజీలో మరిచాను'' బెడ్ మీద కూర్చుని దోసిట్లో మొహం దాచుకున్న శిల్పను ఓదార్చాడు భార్గవ్.

''హు! నాతో మాట్లాడద్దు'' అని విదిలించింది.

అయినా ఊరుకోక మెల్లగా భార్య మోమెత్తి ''చూడు శిల్పా! నీకు మల్లెలేల? అవి స్వచ్ఛమైన నీ హృదయంలో దాగున్నాయి. ఇంక మరువపు పరిమళం నీ దేహం నుంచి వెదజల్లుతున్నావు. గులాబీలు కూడా నీ మేని రంగుకి దిగదుడుపే! మందారం కంటే ఘనమైన వర్ణం కలిగిన బింబోష్టివి నువ్వు. నేనేది తేవటం మరచినా ఆ సౌందర్యమంతా నీలోనే నిబిడీకృతమై వున్నదే. ఆరాధించే మనసుంటే



చాలు తోడున్న సరిజోడిలోనే సాక్షాత్కరిస్తాయి.'' అని తనదైన శైలిలో కవితా ధోరణి వెళ్ళగక్కాడు భార్గవ్.

భర్త భార్గవ్ నిష్కాపట్యానికి పొంగిపోయింది శిల్ప. మరుక్షణం అతని గుండె గువ్వల్లో ఒదిగిపోయింది.

''ఈ రోజు ఏ లెక్కన ముద్దులు పెట్టాలి?'' అడిగాడు.

''మీ ఇష్టం...!''

''అయితే తిథుల లెక్కన. పాడ్యమి, విదియ, తదియ...''

''అమ్మో! పదిహేను ముద్దులా!'' భయం నటించింది శిల్ప.

''అంతే కాదోయ్! శుక్లపక్షం ప్రకారమైతే కాలిగోటి దగ్గర నుండి శిరస్సుదాకా... కృష్ణ పక్షం లెక్కనైతే ముఖం నుండి పాదాలదాకా అంటే మొత్తం ముప్ఫై ముద్దులు'' ప్రారంభిస్తూ చెప్పాడు.

''ఇదిగో పంచమి మంచిదంటారు. అది మాత్రం నాభిపైనే!''

''దొరగారు వ్యూహరచన బాగా చేసారే!''

''ఔను మరి నీ అంగాంగాలను చుంబన చురికలతో ఛేదించద్దూ!'' అని ముప్ఫై ముద్దులూ ముద్దర్లేసాడు భార్గవ్.

ఫలితం బిగికౌగిలి... మెడ ఒంపులో వేడిసెగ కాల్పులు.

మరో రోజు తెలుగు సంవత్సరాల ప్రకారం ముద్దులు పెడతానంటూ ఆట పట్టించే వాడు. అన్నిటికీ మొదట యాగీ చేసినా తరువాత ఒప్పుకునేది శిల్ప. రాన్రానూ భర్త పిచ్చి ఆమెకీ తలకెక్కింది. అష్టాదశ పురాణాల పేరుతోనో, భారతంలో పర్వాల సంఖ్యలోనో, చతుష్షష్టి కళల మీదనో పెట్టి భర్తను ముద్దు మురిపాలతో ముంచేసేది.

ఆ కొత్త ట్రెండ్ వారి నడుమ గమ్మత్తుగా సాగేది.

ఒక్కోరోజు భార్గవ్ ఆఫీసుకు వెళుతూంటే ఆపి ''మీరు ఆఫీసులో హాయిగా పని చేసుకోటానికి టానిక్ లాటి వేడి ముద్దోటి ఇస్తాను'' అని గట్టిగా ముద్దాడేది శిల్ప.

''నువ్వనుకున్నట్టు టానిక్ కాదు నన్ను తిన్నగా పనిచేసుకోకుండా చేసే టైటానిక్'' అని వెళ్ళిపోయేవాడు భార్గవ్.

ఇవే కాదింకా ఎన్నెన్నో... పెళ్ళయిన కొత్తలో.... అరకువ్యాలీ.... బొర్రా గుహలు... గోవిందపురంలో కృష్ణమందిరం... రామతీర్థం బోడికొండ... పుణ్యగిరి, కుమిలి దేవాలయాలు... ఇవన్నీ ఆ దంపతుల వ్యాహ్యాళీ కేంద్రాలు.

ఒక్కోసారి భార్గవ్ క్యాంపుకెళ్ళి పదిహేను రోజుల దాకా వచ్చేవాడు కాదు. అప్పుడు భర్త సెల్‌కి ఫోన్‌చేసి త్వరగా రమ్మని కోరేది. అతను తిరిగి రాగానే చుట్టేసి ఏడ్చేసేది. అన్ని రోజుల విరహాగ్ని ఒక్కరాత్రి విలాసకేళితో చల్లారేది.

***

అన్నీ గుర్తొచ్చి ఒక్కసారిగా అనంతమైన అసంతృప్తి వెల్లువలా ఉప్పొంగింది భార్గవ్‌లో.

ఒకప్పుడు సఖ్యతకీ, సంతృప్తికీ పెన్నిధిలా నిలిచి ఆనందాంబుధిలో ఓలలాడించేది శిల్ప. తమ ఆశలకు, సుఖాల పరవళ్ళకు నిదర్శనంగా నిలిచారు పాప మహిత, బాబు రోహిత్. వాళ్ళతో ఫుల్‌స్టాప్.

ఆ తర్వాత క్రమక్రమంగా శిల్పలో ఈ ఆకస్మిక పరిణామానికి, అర్ధాంతర విముఖతకీ అంతుబట్టని విచికిత్స నెలకొన్నది భార్గవ్‌లో. అది మొదలు విరహంతో వేగిపోతున్నాడు. కోర్కెలకు కళ్ళెం వేయలేని సంకటస్థితి....

శృంగార రాజ్య బహిష్కరణ.

'నో ఎంట్రన్స్' బోర్డ్‌తో నిలుచుంది శిల్ప. గ్రీన్‌సిగ్నల్ కనుచూపులో కానరాలేదు. ఒక్కోసారి ఒక్క భార్యతోనేనా వేరే దారులు లేనే లేవా అని తనకు తానుగా ప్రశ్నించుకొని మనసులో అంచెలంచెలుగా కోరికలు చెలరేగినా 'ఎయిడ్స్' భూతం ఒకటి ఝుడిపించ సాగింది.

ఒక్కో సమయంలో శిల్ప తడి ఒంటితో కనిపించేది. మరోసారి ట్రాన్స్‌పరెంట్ నైటీతో దర్శనమిచ్చేది. ఆ అవతారం కవ్వించినట్టు అనిపించి జల

పాతం లాగ మీదకు ఉరికినా ఆమె నుంచి స్పందన శూన్యం. ప్లీజ్! అది మాత్రం వద్దు. అనేది.

అప్పుడు భార్గవ్ మనసు వికలమైపోయేది. ఆఫీసులో కూడా రొటీన్‌గా వర్క్ చేసుకునే వాడు. చివరికి అతని వాలకం కనిపెట్టిన మిత్రుడు రణధీర్ అడిగేసాడు. భార్గవ్ దాచకుండా చెప్పేసాడు.

పకపక నవ్వాడు రణధీర్.

''నేను చాతకాని వాడిలా కనిపిస్తున్నాను కదూ! అందుకేగా నవ్వింది'' విచారంగా అన్నాడు భార్గవ్.

''ఛ ఛ... అదికాదు. ఈ చిన్న విషయానికి ఏం చేయాలో పాలుపోవటం లేదంటే నవ్వొచ్చింది'' అని భుజం తట్టి అన్నాడు రణధీర్.

''ఇది నీకు చిన్న విషయంలా కనిపిస్తోందా?''

''యస్! ఇటువంటి దాంపత్య సమస్యలను పరిష్కరించడానికి కౌన్సిలింగ్ సెంటర్స్ వెలిసాయి''.

''కౌన్సిలింగ్ సెంటర్స్ అంటే?''

''మానసికంగా చాలామంది చెప్పుకోలేని ఇబ్బందులు పడుతూంటారు. కొన్ని చెరిగి పోని ముద్రలేస్తాయి. మూల కారణాన్ని వెలికితీసి వారి జీవితాన్ని సవ్యంగా చేయడమే ఈ సెంటర్ల లక్ష్యం'' విపులంగా చెప్పుకొచ్చాడు రణధీర్.

పట్నంలో దివ్యజారావు అనే సైకియాట్రిస్ట్ కౌన్సిలింగ్‌లో అందెవేసిన చేయి. అక్కడికి తీసుకెళ్ళమని సలహా ఇచ్చాడు రణధీర్.

ఈ విషయమే నేరుగా చెపితే అంగీకరిస్తుందో లేదోనని అనుమానంతో చెప్పడానికి జంకాడు.

ఇల్లు చేరాడు భార్గవ్. సరిగ్గా అప్పుడే శిల్ప టవల్ పట్టుకోని స్నానానికి వెళ్లబోతోంది. అంతే భార్గవ్ అమాంతం ఆమెను ఎత్తుకోని బెడ్‌మీద పడేసాడు. అందిన చోటల్లా ముద్దిడాడు. గట్టిగా కౌగిలించుకోబోయే సరికి ఇక సహించలేక భర్తను బలంగా తోసేసింది.

''మీకు పిచ్చా! వెర్రా? వద్దంటే వినరేం... నాకసలే ఒంట్లో బాగోలేదు'' అని గబాలున లేచిపోయింది శిల్ప.

''ఆ మాట చెప్పొచ్చుగా. అయితే సాయంత్రం డాక్టర్ దగ్గరకు తీసుకెళతాను పద'' అని సముదాయించాడు.

''వద్దులెండి. చిరాగ్గా ఉందని అలా అన్నాను''.

''లేదు ఒంట్లో ఏదో నీకు తెలీకుండా ఉండే ఉంటుంది. చెకప్ చేసుకోవటంలో తప్పులేదు'' అనునయంగా అన్నాడు భార్గవ్.

''సరే మీ ఇష్టం'' ఒప్పుకున్నది శిల్ప.

రాచబాట పరచినట్టయింది భార్గవ్‌కి.

***

క్లినిక్‌లోంచి విసవిసలాడుతూ బయటికి వచ్చిన శిల్పను చూసి దిమ్మెరబోయాడు భార్గవ్.

''మహాగొప్ప డాక్టర్ దగ్గరకే తీసుకెళ్ళారండీ. వెధవ ప్రశ్నలు గుప్పించాడు. మీరు బెడ్రూంలో ఎలాటి డ్రస్సులు ధరిస్తారు? మీ ఆయనగారు మిమ్మల్ని మూడ్‌లోకి రప్పించడానికి ఎటువంటి చిలిపి పనులు చేస్తారు? మీకు దేనివల్ల సంతృప్తి కలుగుతుంది? మీరలిగినప్పుడు మీ వారు అలకతీర్చి పానుపు ఎక్కించారా? లేక మరింతగా రెచ్చగొట్టారా? ఇలాటి మరెన్నో ప్రశ్నలేసి నన్ను చంపాడనుకోండి. ఛ ఛ.... జనరల్ చెకప్ అండీ!'' తెగ విసుక్కుంది శిల్ప.

ఒక్కసారిగా మ్రాన్పడిపోయాడు భార్గవ్.

ఎప్పటి శిల్పే....!!

భార్గవ్ వేరేగా డాక్టర్‌ను కలిసాడు.

''కొందరిలో అరుదుగా కొన్ని ముద్రించుకుపోతాయి. అది ఎవరి ప్రభావమేనా కావచ్చు. లేదా పుస్తకాల వల్ల కావచ్చు. జీవితంలో ఎదురయ్యే ఏదైనా అనూహ్యమైన సంఘటనతో మార్పు రావచ్చు. అంతవరకూ వేచి చూడ్డం తప్ప ఏం చేయలేం'' అని తన సలహానిచ్చాడు డాక్టర్.

శిల్పలో సంభవించిన ఈ పరిణామం భార్గవ్‌ను తీవ్ర అశాంతికి గురిచేసింది.

***

భార్గవ్ శిల్పకు ఎంత దగ్గర కావాలనుకున్నా సరే సాధ్యం కావటం లేదు. అందుకే ఆఫీసునుంచి కూడా త్వరగా రావాలనిపించడం లేదు. భార్గవ్ వైఖరికి అంతా విస్తు బోయారు.

ఒకరోజు భార్గవ్ ఇంటికి చేరేసరికి ఎవరి అలికిడి లేదు. వీధిలో నిలబడి చూశాడు. బయట రోహిత్ ఆడుకుంటున్నాడు. సైగచేసి పిలిచాడు. వాడిని అమ్మ ఎక్కడి కెళ్ళిందని అడిగితే చెప్పాడు. అరగంట తరువాత వచ్చింది శిల్ప.

''ఎదురింట్లో కొత్తగా ఎవరో దిగారు. కొద్దిగా సాయం చేయమన్నారు. వెళ్ళాను. పాపం ముసలాళ్ళు. మీరోసారి రండి పరిచయం చేస్తాను'' అని భార్గవ్‌ని లాక్కెళ్ళింది.

రిటైరైన మాజీ సైనికోద్యోగి నవనీతరావు. అతని భార్య విమలమ్మ. పల్లె నుండి పట్నం వచ్చారు. కొత్తగా ఇల్లు కట్టుకునేదాకా ఇక్కడే ఉంటారుట. పరస్పరం పరిచయా లయ్యాయి.

''మీ శ్రీమతిని సాయానికి పిలిచామని ఏమీ అనుకోవద్దు'' అన్నాడు నవనీతరావు.

అప్పుడే పూటయినా కాలేదు దిగి. ఇంతలోనే సాయాలా! ఈ ముసలాళ్ళతో సావాసమైతే ఇంక తన కొంప కొల్లేరయినట్టే! ఇల్లు సర్దటం పూర్తయ్యే దాకా శిల్ప అయిపులేదు. విమలమ్మ తమ పిల్లలను ఆడించింది. భార్గవ్‌తో కబుర్లాడాడు నవనీతరావు.

***

శిల్ప ఇప్పటికే లొంగని మొండిఘటం అయింది. అందుకే సుఖాలకి దూరమయ్యాడు తను. శిల్పలో మార్పు వచ్చే సూచన కనుచూపు దూరంలో కనిపించలేదనే చెప్పాలి. కారణమేమంటే ఎదురుగా ముసలి దంపతులతోనే ఆమె స్నేహం! వాళ్ళ వేదాంత ధోరణే ఈవిడగారికీ ఒంటబట్టి మరింత జడురాలవుతుంది. సరసానికి మరింత విముఖత కలగటం ఖాయం! ఎప్పుడూ శిల్ప ఆ ముసలాళ్ళ నామమే జపిస్తోంది మరి. వాళ్ళని ఆది దంపతులుగా కీర్తిస్తున్నది. ఇకనేం ఆధ్యాత్మిక చింతన వేళ్ళూనుకోవటం తప్పదు. తను తులసిపూలు తిప్పుకుని కూర్చోవడమే! అప్పుడు శృంగారం పట్ల ఆపేక్ష సున్నావే!

***

ఆ రోజు భార్గవ్ చాలా చిరాగ్గా ఉన్నాడు. ఇంట్లో శిల్పలేదు. ఒక వైపు పాప మహిత ఏడుస్తోంది. కారం రాసుకున్నట్టయింది. ఒక్క ఉదుటున ఎదురింటికి వెళ్ళాడు.

శిల్ప విమలమ్మ కాళ్ళు ఒత్తుతోంది. ఛర్రున తిరిగి వచ్చేసాడు భార్గవ్.

''ఏమండీ! ఏమైంది?'' వెనకాలే వచ్చి అడిగింది.

''ముసలాళ్ళ సేవలు పూర్తయ్యాయా?'' పాపను జోకొడుతూ అన్నాడు.

''అదికాదండీ... పాపం విమలమ్మగారికి ఒంట్లో నలతగా ఉందట'' అన్నది నెమ్మదిగా.

''నీకు నీ సంసారంలో నలతలు కనిపించవు గానీ, నిన్నగాక మొన్న వచ్చిన వారిని పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నావు''.

''నన్ను అర్థం చేసుకోండి ప్లీజ్!'' అని బ్రతిమలా



## తమన్న ప్రేమలో పడిందా?

'హ్యాపీడేస్'తో తెలుగులో హీరోయిన్‌గా మారిన తమన్న, ప్రస్తుతం తమిళంలో బిజీ స్టార్ అయిపోయింది. తమిళంలో ఒక్కో సినిమాకు కోటి రూపాయల పారితోషికం తీసుకుంటూ దూసుకుపోతున్న తమన్న ప్రేమలో పడిందట! తమిళంలో 'కేడి' సినిమా చేస్తున్నపుడే ఆ సినిమా దర్శకుడితో ప్రేమలో పడిందన్న వదంతులు వ్యాపించాయి. అయితే ఆ పుకార్లను ఇటు తమన్నా, అటు ఆ దర్శకుడు ఇద్దరూ ఖండించారు. అయితే తమన్న ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దీని మీద సుదీర్ఘ వివరణే ఇచ్చింది. ప్రేమలో పడేంత టైం తన దగ్గర లేదనీ, సినిమా షూటింగ్‌లతో బిజీ బిజీగా ఉన్నానని చెప్పింది. ప్రేమలో పడినా, పెళ్ళి చేసుకోవాలనుకున్నా అందరికీ చెప్పే చేసుకుంటానని, చెప్పకుండా చేయాల్సిన ఖర్మ తనకు పట్టలేదని అంటోంది తప్ప ఆ దర్శకుడి మీద ప్రేమ లేదు అని మాత్రం అనడంలేదు. అదీ సంగతి!

డింది. భర్త అనిశ్చిత స్థితిని పటాపంచలు చేయడానికి ఆమె ఎంతగానో ప్రయత్నించింది. కానీ, శూన్యం.

***

''ఏం పాపం! అంత వేగిరం తిరిగొచ్చేసావు? కమ్మటి కబుర్లు చెప్పి రాలేక పోయావా?'' అని వ్యంగ్యంగా అడిగాడు భార్గవ్.

''మీ వైఖరి వాళ్ళు పోల్చేసారు కాబోలు. తొందరగా తలుపులు బిగించేసారు'' అని నిట్టూర్చింది శిల్ప.

''పగలంతా చెప్పిన నీతుల మోతాదు సరిపోయిందని అనుకున్నారేమో!''

''వారిని ఆడిపోసుకోవద్దు''

''మరీ నీ మడి భాషకి అర్థం?''

''అది నా సొంత విషయం''

''వారి ప్రభావం నీపై లేదంటే నమ్మే వెర్రి వెంగళాయిని కాదు''.

''ఔను.... ఆ ముసలాళ్ళ ప్రభావమే! సరే నా...హు!'' అటు తిరిగి పడుక్కుంది శిల్ప.

***

భార్గవ్ ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి ఎదురింటి దగ్గర రిక్షా ఆగి ఉన్నది. అందులోంచి డబుల్ కాట్, బెడ్ దించుతున్నారు. శిల్ప సాయం పడుతోంది. అది చూసిన భార్గవ్‌కి ఒళ్ళు మండింది. పిల్లలను సైతం లెక్కచేయకుండా ఆ ముసలాళ్ళ సేవకే అంకితమైపోతోంది.

శిల్ప ఎప్పుడొచ్చిందో తెలీదు. ఒక్కసారిగా తనను అల్లుకుపోతున్న ఆమెను విదిలించాడు.

''ప్లీజ్! నన్ను అర్థం చేసుకోండి'' గడ్డం పట్టుకొని బ్రతిమిలాడింది.

''ముసలాళ్ళు నూరిపోసారుగా! అక్కడే కాపురం పెట్టాల్సింది''.

''వాళ్ళని ఒక్క పల్లెత్తు మాటన్నా ఒప్పేది లేదు''

''ఏం... వారి ప్రభావం ఎంతమాత్రం లేదు అంటావు''

''కాదు ఉందనే అంటాను. గాఢంగా పని చేసాయి వారి సూత్రాలు. మాటలు.... చేతలు''

''నా మాటలు నాకే అప్పచెబుతున్నావు కదూ!'' కోపంగా అన్నాడు భార్గవ్.

''కాదు మీ అపోహను తొలగించటానికి ప్రయత్నిస్తున్నాను. వినండి. మొదటినుండి నేను, బాల్య వివాహంతోనే విధవరాలైన బామ్మ చాటున పెరిగి పెద్దయ్యాను. పెళ్లయిన పిదప పిల్లలను కనటం అవగానే సరసానికి స్వస్తి పలకాలని, లేకుంటే అందం, ఆరోగ్యం దెబ్బతింటాయని, ముసలితనం త్వరగా వస్తుందని, చెప్పిన బామ్మ మాటలు నాలో బలంగా పాతుకుపోయాయి. అందులో ఎంతవరకూ నిజం ఉందో తెలుసుకోడానికి ఏనాడు ప్రయత్నించలేదు. సరిగ్గా అదే సమయానికి మన ఎదురింట్లో దిగారు వృద్ధ దంపతులు. వాళ్ళిద్దరూ చిలుకా గోరింకల్లాగ కమ్మని కబుర్లు చెప్పుకుంటూ, చిలిపి చేష్టలు చేసుకుంటూంటే, ఈ వయసులో ఈ ముచ్చటేమిటని ఆవిడ మొహం మీదనే అడిగేసాను. అసలు తామింతకాలం ఆరోగ్యంగా, ఆనందంగా, కలుపుగోలుగా ఉండటానికి కారణం శృంగారమేనని, దాంపత్యంలో కొత్తదనం ఎల్లవేళలా నిలవడానికి అదే ఏకైక రహస్యమనీ చెప్పారు. ఈరోజు డబుల్‌కాట్, బెడ్ తెస్తే అవి వారి కొడుకు కోసమనుకున్నాను. కానీ, అవి తమకే అన్నారు. తాము ఏకాంతంగా ఉండాలనే ఇలా ఎవరిదగ్గరికీ పోకుండా ఉన్నారట! మనస్సుండాలే గానీ, వయసు గుర్తుకు రాదట. చెప్పండి... వారి ప్రభావం నామీద ఎంతబాగా పని చేసిందో, ఎంత ఉపయోగ పడిందో... అనవసరంగా వారి మీద అపోహపడ్డారు. నాలో మార్పు తెచ్చింది. వాళ్ళేనంటే ఇప్పటికయినా నమ్ముతారా?!'' అని ఏకబిగిన చెప్పిన శిల్ప వంక చూసాడు భార్గవ్.

ఆమె కనుల్లో నీటిని కొనగోటితో తుడిచి అమాంతం అక్కున చేర్చుకుని కమ్మని ముద్దిచ్చాడు.

పరవశంగా బిగి కౌగిలిలో ఒదిగిపోయింది శిల్ప...!!!

*


చిరునామా:
కె.కె.రఘునందన,
రామతీర్థం -535 218
విజయనగరం జిల్లా
సెల్: 94926 20382


## మనమీదేనర్రోయ్!

సరసి



